జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 68 20-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను
తొలివెలుగు
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




# గ్లోబల్ సినీ హబ్‌గా తీర్చిదిద్దుతాం..

- సినీ పరిశ్రమకు సింగిల్ విండో విధానం
- తెలంగాణ గద్దర్ సినీ అవార్డులు2025 ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- చిత్ర పరిశ్రమకు గమ్యస్థానంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తాం
- సామాజిక సమస్యలపరిష్కారానికి సినిమాలు దోహదపడాలన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజు చేయడమే లక్ష్యంగా తమ పాలన కొనసాగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సరాన్ని రైతు నామ సంవత్సరంగా మారుస్తామని వెల్లడించారు. గురువారం రవీంద్రభారతిలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో 70 శాతం కుటుంబాలు వ్యవసాయాధారితంగానే మనుగడ సాగిస్తున్నాయని చెప్పారు. ఈ దృష్ట్యా వ్యవసాయరంగ

- మిగతా 2వ పేజీలో

# నాలుగు విడతల్లో 41 నోటిఫికేషన్లు

- ఈ ఏడాదికి 10,060 ఉద్యోగాల భర్తీ
- టీచర్ పోస్టులు 2,535.. కానిస్టేబుల్స్ 2,370
- గ్రూప్1లో 91.. గ్రూప్2లో 750 పోస్టులు
- నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకోండి
- ఇక ఏటా ఉద్యోగాల ప్రకటన పండగ: లోకేశ్

అమరావతి: నిరుద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్ వచ్చేసింది. 10,060 పోస్టులతో భారీ జాబ్ క్యాలెండర్‌ను కూటమి ప్రభుత్వం ఉగాది సందర్భంగా గురువారం విడుదల చేసింది. మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి లోకేశ్ 'ఎక్స్' ద్వారా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ ఏడాది నాలుగు విడతల్లో మొత్తం 41 నోటిఫికేషన్ల ద్వారా ఈ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. మే 15, ఆగస్టు



## ఉగాది వేడుకల్లో పాల్గొన్న వైఎస్ జగన్ దంపతులు!

- వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు
- ఉగాది వేడుకల్లో పాల్గొన్న వైఎస్ జగన్ దంపతులు
- పరాభవ నామ సంవత్సరంలో వైసీపీకి అనుకూల ఫలితాలు



2లో



## ప్రతిపక్షం బలపడే అవకాశం

- పంచాగ పఠనంలో మృత్యుంజయశర్మ, ఫణీంద్రశర్మ
- తెలంగాణ భవన్‌లో ఉగాది వేడుకలు.. హాజరైన కేటీఆర్

2లో

## ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నా..

- ఏపీలో భారీ స్థాయిలో ఉద్యోగాల భర్తీకి శ్రీకారం
- జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్
- ఇక పోటీ పరీక్షలకు సిద్ధం అవ్వండంటున్న మంత్రి లోకేశ్



# ఇంధన వనరులపై దాడులా?

- తీవ్రంగా ఖండించిన భారత్
- చర్చలు, దౌత్యమే మార్గం: మోదీ
- యుద్ధ పరిణామాలపై ఆందోళన
- ఒమన్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేసియా అధినేతలతో సంభాషణ

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో కీలక ఇంధన వనరులపై దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. "ప్రపంచమంతటినీ ఎంతగానో కలతకు గురి చేసే అంశమిది. ఇప్పటికే ఒడిదొడుకుల్లో ఉన్న అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌ను ఈ దాడులు మరింతగా దెబ్బ తీస్తాయి"అంటూ ఆందోళన వెలిబుచ్చింది. ఇరాన్‌లోని సౌత్ పార్స్ చమురు క్షేత్రాలపై





2లో

## మంచి ముహూర్తం చూసుకుని కొత్త పార్టీ ప్రకటిస్తాను

- పార్టీ అజెండాపై కసరత్తు జరుగుతుంది
- గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నాను
- డాడీ, మోడీ, చిన్న మోడీపై నా పోరాటం ఉంటుంది
- బీఆర్ఎస్‌తో నా ఇష్యూను కాంగ్రెస్, సీఎం రేవంత్ అడ్వాంటేజ్‌గా తీసుకుంటున్నారు. -కవిత

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకోబోతోంది. గత కొంతకాలంగా మౌనంగా ఉన్న ఎమ్మెల్సీ కవిత, తన భవిష్యత్ కార్యాచరణపై క్లారిటీ ఇచ్చారు. త్వరలోనే నూతన రాజకీయ పార్టీని ప్రకటించబోతున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పార్టీ అజెండాపై ప్రస్తుతం లోతైన కసరత్తు జరుగుతోందని కవిత వెల్లడించారు.

# సౌదీ అరాంకోపైనా ఇరాన్ దాడులు

- 17 శాతం ఉత్పత్తి కేంద్రాలు బుగ్గి?
- భారీ నష్టం, కోలుకునేందుకు ఐదేళ్లు!
- రూ. 2.4 లక్షల కోట్లు అవసరం!
- అక్కడినుంచే మనకు ఎల్ఎన్‌జీ
- కువైట్, అబుదాబి క్షేత్రాలపైకీ డ్రోన్లు
- వాటిని నాశనం చేస్తామని హెచ్చరిక
- అప్పుడు సౌత్ పార్స్ క్షేత్రం బుగ్గే!

దుబాయ్: పశ్చిమాసియా యుద్ధం ప్రపంచ ఇంధన భద్రతను నానాటికీ పెను ప్రమాదంలోకి నెడుతోంది. ఇరాన్‌లోని సౌత్ పార్స్ సహజవాయు క్షేత్రంపై చేసిన ఇజ్రాయెల్ దాడి తీవ్ర విపరిణామాలకు దారి తీస్తోంది. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్ గురువారం గల్ఫ్ దేశాల్లోని చమురు క్షేత్రాలన్నింటికీ నిప్పు పెట్టే ప్రయత్నం చేసింది! ఖతర్, సౌదీ అరేబియా,



2లో

## నాలుగు విడతల్లో 41 నోటిఫికేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

15, సెప్టెంబరు 15, అక్టోబరు 15 తేదీల్లో ఈ నోటిఫికేషన్లను విడుదల చేస్తారు. డీఎస్సీ ద్వారా మరోసారి 2,535 టీచర్ ఉద్యోగాలను పాఠశాల విద్యాశాఖ భర్తీ చేయనుంది. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 1,970 కానిస్టేబుల్ పోస్టులను, ఏపీపీఎస్సీ ద్వారా 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల నియామకాలను పూర్తిచేస్తారు. 147 ఫైర్ డ్రైవర్ ఆపరేటర్ పోస్టులను అగ్నిమాపక శాఖ భర్తీ చేస్తుంది. అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ 1,500 పోస్టులకు ఏపీపీఎస్సీ రాత పరీక్ష నిర్వహిస్తుంది. అనంతరం యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూల ద్వారా ఆ పోస్టులను భర్తీ చేస్తారు. గ్రూప్-1లో 91 పోస్టులు, ఎస్ఐ 418, జైల్ వార్డెన్(మెన్) 171, ఫోరెన్సిక్ లేబొరేటరీ పోస్టులు 64, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ 93, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ 48, బీసీ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ 100, ప్లానింగ్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ 251, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ 95, గ్రూప్-2లో 750, గనుల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 503, ఏఎంవీఐ 50, డైట్ లెక్చరర్ 104, డైట్ సీనియర్ లెక్చరర్ 46, ఇంటర్ జూనియర్ లెక్చరర్ 209, పాఠశాల విద్యాశాఖలో లైబ్రేరియన్స్ 100 పోస్టులు ఉన్నాయి.ఎఫ్ఎసఎల్ అసిస్టెంట్ డైరెక్టర్-8, సోషల్ వెల్ఫేర్ ఏఎసడబ్ల్యూవో-11, ట్రైబల్ వెల్ఫేర్ ఏటీడబ్ల్యూవో-6, ట్రైబల్ వెల్ఫేర్ ఏడీ-1, అటవీ శాఖలో ఎఫ్ఆర్‌వో-4, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్-35, ఎఫ్ఎసవో-41, అదేశాఖలో టెక్ అసిస్టెంట్-20, పీసీబీలో పర్యావరణ ఇంజనీర్లు-40, ప్లానింగ్ ఏడీ-17, ఉద్యాన అధికారులు- 25, పశుసంవర్ధక శాఖ-80, కార్మిక శాఖలో ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్-12, జువైనల్ శాఖలో సూపర్‌వైజర్-49, గనుల శాఖలో ఏడీ-1, టెక్నికల్ అసిస్టెంట్-36, రాయల్టీ ఇన్‌స్పెక్టర్-9, ల్యాబ్ అసిస్టెంట్-1, ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ కెమికల్ ఎగ్జామినర్-9, ఎస్‌సీఈఆర్‌టీ లెక్చరర్-10 పోస్టులు ఉన్నాయి. జాబ్ క్యాలెండర్ విడుదల అంశంపై ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని మంత్రి లోకేశ్ అన్నారు. 'యువగళం పాదయాత్రలో జాబ్ క్యాలెండర్ ఇస్తామని ఇచ్చిన హామీని ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకోవడం సంతోషంగా ఉంది. నిర్దేశిత సమయంలో పోస్టుల భర్తీ పూర్తిచేస్తాం. ఉద్యోగార్థులంతా నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. ఇక ప్రతి ఏటా ఉద్యోగాల ప్రకటన పండగ ఉంటుంది. పరీక్షలకు సిద్ధం అవ్వండి' అని ఎక్స్‌లో పిలుపిచ్చారు.

## ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నా..

ఆంధ్రప్రదేశ్ యువతకు ఉగాది 2026 సందర్భంగా శుభవార్త అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టింది. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ జాబ్ క్యాలెండర్ విడుదల సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజా ప్రభుత్వంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో మొత్తం 10,060 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ నియామకాల కోసం నోటిఫికేషన్లు ఎప్పుడు విడుదల అవుతాయో, ఎన్ని పోస్టులు భర్తీ చేస్తామో స్పష్టంగా జాబ్ క్యాలెండర్‌లో వెల్లడించామని తెలిపారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. పరీక్షలు నిర్వహించి, అన్ని పోస్టులను సమయానికి భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అభ్యర్థులకు పారదర్శకత కల్పించేందుకు సిలబస్‌ను కూడా ముందుగానే ప్రకటిస్తామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఉద్యోగార్థులు నైపుణ్యం పోర్టల్‌లో వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకుని.. అన్ని అప్‌డేట్స్, అలర్ట్స్ పొందవచ్చని మంత్రి లోకేశ్ సూచించారు. దీంతో అభ్యర్థులు ఎటువంటి సమాచారాన్ని కోల్పోకుండా సకాలంలో సిద్ధం కావడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇకపై ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా ఉద్యోగాల ప్రకటన పండుగలా నిర్వహిస్తామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. చివరిగా రాష్ట్రంలోని ఉద్యోగార్థులందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని మంత్రి సూచించారు.

## మంచి ముహూర్తం చూసుకుని కొత్త పార్టీ ప్రకటిస్తాను


(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా మహాత్మా గాంధీ సర్వోదయ సిద్ధాంతాన్ని తాను లోతుగా అధ్యయనం చేస్తున్నానని, అదే అజెండాతో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. మంచి ముహూర్తం చూసుకుని పార్టీ పేరును, ఇతర వివరాలను అధికారికంగా ప్రకటిస్తానని ఆమె తెలిపారు. ఇప్పటికే పార్టీ పేరు విషయంలో అన్నీ సెట్ అవుతున్నాయని, కార్యాలయం కోసం స్థలాన్ని కూడా అన్వేషిస్తున్నామని ఆమె వివరించారు. తన రాజకీయ పోరాటం ఎవరితో ఉండబోతోందో కవిత సూటిగా చెప్పారు. డాడీ, మోడీ, చిన్న మోడీ పైనే తన పోరాటం ఉంటుందని ఆమె ప్రకటించారు. తనకు ఎవరితోనూ రాజీ లేదని, తన కొత్త పార్టీ ఖచ్చితంగా సక్సెస్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీతో తనకు ఉన్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ , సీఎం రేవంత్ రెడ్డి అడ్వాంటేజ్‌గా తీసుకుంటున్నారని కవిత ఆరోపించారు. అసెంబ్లీలో సైతం కాంగ్రెస్ నేతలు తన ఇష్యూను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆమె అసహనం వ్యక్తం చేశారు. శ్రీరామనవమి తర్వాత పార్టీ ప్రకటన ఉంటుందని, అంతకంటే ముందే జాతీయ స్థాయి నేతలను కలుస్తానని కవిత తెలిపారు. చాలా మంది జాతీయ నాయకులతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, వారి మద్దతు కూడగడతానని చెప్పారు.

## ప్రతిపక్షం బలపడే అవకాశం

హైదరాబాద్: ప్రభుత్వంలో ఉన్న లోటుపాట్లతోపాటు పాలనా వైఫల్యాలు కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, ఈ ఏడాది ప్రతిపక్షానికి గణనీయంగా బలం చేకూరే అవకాశం ఉందని వేద పండితులు మృత్యుంజయశర్మ, ఫణీంద్రశర్మ వెల్లడించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే, ప్రత్యామ్నాయ శక్తిగా బీఆర్ఎస్ ఎదిగే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. పరాభవ నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ భవన్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మృత్యుంజయశర్మ, ఫణీంద్రశర్మ పంచాంగ పఠనం చేశారు. విద్యావిధానంలో జరుగుతున్న మార్పులు... విద్యార్థులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోతే నిరుద్యోగం మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. విదేశీ శక్తుల కుట్రలను మన సైనికులు సమర్థవంతంగా ఎదుర్కొంటారని, ఇరుగు-పొరుగు దేశాలతో కొన్ని ఉద్రిక్తలు చోటు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురిసే సూచనలున్నాయని, ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలు బాగా పండే అవకాశం ఉందని, రైతుల ఆత్మహత్యలు తగ్గే సూచనలు ఉన్నాయని చెప్పారు.

# గ్లోబల్ సినీ హబ్‌గా తీర్చిదిద్దుతాం..



సినీ పరిశ్రమకు సంబంధించిన అన్ని అనుమతులు ఒకే దగ్గర లభించేలా సింగిల్ విండో విధానాన్ని తీసుకువస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. కేవలం స్టోరీతో సంప్రదిస్తే సినిమా పూర్తి చేసుకుని రీల్‌తో వెళ్లే విధంగా వెంట వెంటనే జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఐటీ, ఫార్మా పరిశ్రమకు సమానంగా సినీ పరిశ్రమను గుర్తించామని, చిత్ర పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. గురువారం హైటెక్స్‌లో తెలంగాణ గద్దర్ సినీ అవార్డులు2025 ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆ నలుగురు చార్ మినార్ల వంటివారు.. ద'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఇవ్వడం మా ప్రభుత్వం బాధ్యతగా భావించింది. హైదరాబాద్ అంటే కేవలం ఐటీ హబ్, బిర్యానీ మాత్రమే కాదు.. ఇదొక సినిమా హబ్‌కు కేరాఫ్ అడ్రస్. భారతీయ సినీ పరిశ్రమకు గమ్యస్థానంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్‌కు చార్మినార్‌లోని చార్ మినార్ల లాగా ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు, కృష్ణ..ఈ నలుగురు సినీ పరిశ్రమను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. రామోజీరావు ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేసి హైదరాబాద్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారు. ప్రభాకర్‌రెడ్డి సినీ కార్మికుల కోసం తన సొంత స్థలాన్ని ఇచ్చారు. ఆనాడు సినీ రంగంలో ఏ సమస్య వచ్చినా ముందుండే దాసరి నారాయణరావును కూడా స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్‌ను గ్లోబల్ సినీ హబ్ గా తీర్చిదిద్దేందుకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇటీవల నెట్ ఫ్లిక్స్ తమ సంస్థను హైదరాబాద్ లో ఏర్పాటు చేసింది. నెట్ ఫ్లిక్స్ వచ్చిందంటే హైదరాబాద్‌కు హాలీవుడ్ వచ్చినట్టే. గద్దర్ ఒక చైతన్యం.. ఒక స్ఫూర్తి. తన పాటతో వేలాది మందిలో చైతన్యం తీసుకువచ్చిన ఆయన పేరుతో ఈ అవార్డులు ఇవ్వడం సంతోషం. సినిమా అనేది చాలా శక్తివంతమైన ఆయుధం. సమాజాన్ని చైతన్యపరిచేందుకు దీన్ని సాధనంగా ఉపయోగించుకోవాలి. సామాజిక బాధ్యతను గుర్తెరిగి గద్దర్ స్ఫూర్తితో సామాజిక సమస్యల పరిష్కారానికి సినిమా ద్వారా సందేశం అందించాలి..'అని సీఎం సూచించారు. 'తెలంగాణ ఆత్మను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు గద్దర్. ఆయన పేరిట అవార్డులు ఇవ్వడం అంటే ప్రభుత్వ ఆలోచన ఏమిటో ప్రపంచానికి చెప్పడమే. తెలుగు చిత్ర పరిశ్రమ హాలీవుడ్ స్థాయికి ఎదిగింది. అనేక సందేశాత్మక సినిమాలు ప్రజల్లో మార్పునకు నాంది పలికాయి. అయితే గత పాలకులు 10 ఏళ్ల పాటు సినిమా అవార్డులు ఇవ్వలేదు. కానీ తెలుగు సినిమా తెలంగాణకే పరిమితం కాకుండా ప్రపంచానికే తలమానికం కావాలనే సీఎం రేవంత్‌రెడ్డి గద్దర్ అవార్డులను తిరిగి ప్రారంభించారు..'అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.

## ఇంధన వనరులపై దాడులా?

(మొదటి పేజీ తరువాయి)

ఇజ్రాయెల్ దాడి, ప్రతీకారంగా ఖతర్‌లోని ఎల్ఎన్‌జీ క్షేత్రం రస్ లఫాన్‌తో పాటు సౌదీ అరేబియాలో అతి పెద్ద చమురు క్షేత్రమైన ఆరాంకోపైనా ఇరాన్ దాడులు కలకలం రేపడం తెలిసిందే. ఇవి భారత్‌ను తీవ్రంగా కలచివేసినట్టు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. పౌర సదుపాయాలు, ఇంధన వనరులపై దాడులు కూడదని భారత్ ముందునుంచీ చెబుతూనే వస్తోందని గుర్తు చేశారు. వాటికి తక్షణం తెర దించాలని గురువారం మీడియా సమావేశంలో ఆయన సూచించారు. భారత ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో 40 శాతానికి పైగా ఖతర్ నుంచి వస్తుండటం తెలిసిందే. పశ్చిమాసియా తాజా పరిణామాలపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వెలిబుచ్చా రు. ఈ విషయమై పలువురు దేశాధినేతలతో ఆయన వేర్వేరుగా సంభాషించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిఖ్, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, జోర్డాన్ రాజు అబ్దుల్లా2తో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో తాజా పరిస్థితులను గురించి వారితో లోతుగా చర్చించారు. ఇంధన వ్యవస్థలపై దాడులు తీవ్రంగా గర్హనీయమన్నారు. ఉద్రిక్తతలకు తక్షణం తెర దించి శాంతి, సుస్థిరత పాదుగొల్పేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హోర్ముజ్ జలసంధి గుండా సురక్షిత నౌకాయాన్ని తక్షణం పునరుద్ధరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. వీటన్నింటికీ దౌత్యం, మధ్యవర్తిత్వమే మార్గాలని స్పష్టం చేశారు. ఆ దిశగా జరిగే ప్రయత్నాలకు భారత్ అన్నివిధాలా మద్దతుగా నిలుస్తుందని మోదీ స్పష్టం చేశారు. అధినేతలతో చర్చలు ఫలప్రదంగా సాగినట్టు ఎక్స్ పోస్టుల్లో ఆయన వెల్లడించారు. పశ్చిమాసియా విషయమై ఆందోళనలతో వారంతా ఏకీభవించినట్టు తెలిపారు. "అబ్దుల్లా2, తారిఖ్‌తో చర్చల సందర్భంగా జోర్డాన్, ఒమన్ ప్రజలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపా. ఇంధన వనరులపై దాడులను ఖండించా"అని తెలిపారు.

## కాంగ్రెస్ నేతపై దాడి హేయం.. చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్ పరామర్శ

- లింగోజిగూడెంలో పర్నే శివరెడ్డి కుటుంబానికి భరోసా
- దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**చౌటుప్పల్, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు పర్నే శివరెడ్డిపై బుధవారం రాత్రి జరిగిన దాడిని మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆమె శివరెడ్డి నివాసానికి వెళ్లి, బాధితుడిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయాల్లో దాడులకు తావులేదని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోవాలే తప్ప గుండాయిజం చేయడం తగదని అన్నారు. బీజేపీ శ్రేణులు కావాలనే దాడికి పాల్పడ్డాయని ఆరోపిస్తూ, శివరెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## వేముల వీరేశంకు సముచిత స్థానం..

- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన బొడ్డుపల్లి లింగయ్య



**రామన్నపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంను రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమించడం పట్ల తెలంగాణ ఉద్యమ నాయకులు బొడ్డుపల్లి లింగయ్య హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పట్ల అవగాహన ఉన్న నాయకుడికి సముచిత గౌరవం దక్కిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యమకారులకు, కష్టపడి పనిచేసే నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉంటుందని ఈ నియామకం నిరూపించిందన్నారు. వీరేశంకు కీలక బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సౌదీ అరాంకోపైనా ఇరాన్ దాడులు

(మొదటి పేజీ తరువాయి)




కువైట్, అబుదాబి సహా పలుచోట్ల చమురు, సహజవాయు క్షేత్రాలపై ఎడాపెడా క్షిపణి, డ్రోన్ దాడులకు దిగింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా పెను కల్లోలం చెలరేగింది. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఎల్ఎన్‌జీ క్షేత్రమైన ఖతర్‌లోని రస్ లఫాన్ ఇరాన్ దాడుల్లో భారీగా దెబ్బ తిన్నది. అక్కడి ఉత్పత్తి కేంద్రాల్లో 17 శాతం మేరకు బుగ్గిపాలైనట్టు ఖతర్ ప్రకటించింది. "ఇది అంచనాలకు అందనంతటి భారీ నష్టమిది! దీన్నుంచి కోలుకునేందుకు కనీసం మూడు నుంచి ఐదేళ్ల సమయం, రూ.2.4 లక్షల కోట్ల (26 బిలియన్ డాలర్ల) నిధులు అవసరం!" అని ఖతర్ ఎనర్జీ సీఈఓ సాద్ అల్ కాబి పేర్కొన్నారు! భారత ఎల్ఎన్‌జీ అవసరాలను సగానికి సగం రస్ లఫాన్ క్షేత్రమే తీరుస్తోంది. దాంతో ఈ దాడి ప్రభావం మనపై తీవ్రంగా ఉండనుంది!!

సౌదీ అరేబియాలో ఎర్రసముద్ర తీరంలో రేవు పట్టణం యన్బులో ఉన్న సమ్రెఫ్ చమురు కేంద్రంపై ఇరాన్ డ్రోన్ దాడికి దిగింది. అరాంకోలో భాగమైన ఆ క్షేత్రంలో భారీగా మంటలు చెలరేగాయి. నష్ట తీవ్రతను అంచనా వేస్తున్నట్టు సౌదీ రక్షణ శాఖ పేర్కొంది. "ఇరాన్ తీరుతో విసిగిపోయాం. మా ఓపికకూ హద్దుంటుంది! పరిస్థితి చేయి దాటితే ఇరాన్‌పై యుద్ధంలోకి మేమూ ప్రవేశించాల్సి వస్తుంది" అంటూ సౌదీ రాకుమారుడు, విదేశాంగ మంత్రి ఫైసల్‌బిన్ ఫర్హాన్ అల్ సాద్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "తిరుగులేని ఆయుధ సామర్థ్యం, యుద్ధ సన్నద్ధత సౌదీ, దాని భాగస్వామ్య దేశాల సొంతం. అవసరమైతే వాటిని ఇరాన్‌పై ప్రయోగించేందుకు ఏమాత్రమూ వెనకడబోమని గుర్తుంచుకుంటే మంచిది" అని హితవు పలికారు. ఇరాన్ డ్రోన్లు కువైట్‌లో కూడా అల్ అహ్మదీ, మైనా అబ్దుల్లా చమురు క్షేత్రాలకు, యూఏఈ, అబుదాబిల్లోనూ పలు సహజవాయు కేంద్రాలకు నష్టం కలిగించాయి. తమ ఇంధన వ్యవస్థలపై దాడులకు దిగి ఇజ్రాయెల్ దిద్దుకోలేనంత పెద్ద తప్పు చేసిందని ఇరాన్ ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. "నిజానికి పొరుగు దేశాల ఇంధన క్షేత్రాలపై దాడులు చేసే యోచనే మాకు లేదు. కానీ మా ఇంధన వ్యవస్థలపై ఇజ్రాయెల్, అమెరికా దాడులతో యుద్ధం మరో స్థాయికి చేరింది. అందుకే గల్ఫ్ దేశాల ఇంధన వ్యవస్థలపై మేమూ దాడులకు దిగాం. మా ఇంధన వ్యవస్థలపై మరోసారి దాడులు జరిగితే గల్ఫ్ దేశాల్లోని సదరు వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేసి తీరతాం" అంటూ హెచ్చరించింది! రస్ లఫాన్‌పై దాడుల పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దానిపై మళ్లీ దాడికి దిగితే కనీవినీ ఎరగని స్థాయి దాడులతో సౌత్ పార్స్ సహజవాయు క్షేత్రాన్ని పూర్తిగా బుగ్గిపాలు చేసేస్తామని ఇరాన్‌ను తీవ్రంగా హెచ్చరించారు. సౌత్ పార్స్‌పై ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేయబోదని అధ్యక్షుడు హామీ ఇచ్చారు.



## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

- రెండు ట్రాక్టర్లు సీజ్.. ఇద్దరిపై కేసు నమోదు
- సెలవు రోజున విధుల్లో నిమగ్నమైన తహసిల్దార్

**రాజపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** మండలంలోని చల్లూరు రెవెన్యూ పరిధిలో వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పోలీసులు సీజ్ చేశారు. తహసిల్దార్ వల్లపు ప్రదీప్ అందించిన సమాచారం మేరకు ఎస్సై లింగారెడ్డి తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్న టిఎస్ 30 ఎల్ 4016, టిజి 30 బి 1622 నంబర్లు గల ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. వాహన యజమానులు వాడి అనిల్, గుంటి కిష్టయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఉగాది పండుగ సెలవు దినం అయినప్పటికీ, అక్రమ రవాణాను అడ్డుకోవడంలో తహసిల్దార్ ప్రదీప్ చూపిన చొరవను మండల ప్రజలు అభినందిస్తున్నారు. తక్కువ కాలంలోనే ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా అక్రమ రవాణా కట్టడిలోకి వచ్చిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాజపేట పంచాయతీలో వైభవంగా పంచాంగ శ్రవణం

- పరాభవ నామ సంవత్సర ఫలితాలు వివరించిన అర్చకులు
- పాల్గొన్న సర్పంచ్ కోయ మధు, గ్రామ పెద్దలు



**రాజపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రాజపేట గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కోయ మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ పాల్గొని నూతన సంవత్సర రాశీఫలాలను, దేశ కాలమాన పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, వివిధ వార్డుల సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాటసారుల దాహార్తి తీర్చడం అభినందనీయం

- జైశ్రీరామ్ ఫౌండేషన్ చలివేంద్రాన్ని ప్రారంభించిన ఊట్కూరి అశోక్ గౌడ్
- వేసవిలో స్వచ్ఛంద సంస్థల సేవలు అవసరం



**రాజపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** ఎండలు ముదురుతున్న వేళ బాటసారుల దాహార్తిని తీర్చేందుకు జైశ్రీరామ్ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం రాజపేట మండల కేంద్రంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోయ మధు, ఉపసర్పంచ్ నిమిల కేదారి గౌడ్, మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, వార్డు సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## డీసీసీ ఉపాధ్యక్షుడిగా పబ్బు రాజుగౌడ్



**చౌటుప్పల్, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురానికి చెందిన పబ్బు రాజుగౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పబ్బు రాజుగౌడ్ మాట్లాడుతూడ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# యాదగిరిగుట్ట అర్చకులకు 'ఉగాది' గౌరవం



- రవీంద్రభారతిలో పురస్కారాలు అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్/యాదగిరిగుట్ట మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఉగాది వేడుకల్లో యాదాద్రి పుణ్యక్షేత్రానికి అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రదానం చేసే ఉగాది పురస్కారాలను ఈ ఏడాది యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన అర్చకులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అర్చకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు కాండూరు వెంకటాచార్యులు, శివాలయం ప్రధాన అర్చకులు జి. నరసింహమూర్తి ఉగాది పురస్కారాలను అందుకున్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పురస్కారాలు స్వీకరించిన వారికి సభలో ప్రత్యేక అభినందనలు లభించాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి, అర్చకులను అభినందించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హన్మంతరావు, దేవస్థానం ఈఓ భవాని శంకర్, ఇంటెలిజెన్స్ విభాగం అధికారి శ్రీనివాసరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పురస్కార గ్రహీతలు ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, "స్వామివారి సేవలో కొనసాగుతున్న మాకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ గౌరవం ఎంతో ఆనందదాయకం. ఇది మా సేవలకు గుర్తింపుగా భావిస్తున్నాం" అని తెలిపారు. యాదాద్రి క్షేత్ర ప్రతిష్ఠకు ఈ పురస్కారాలు మరింత వన్నె తెచ్చాయని దేవస్థాన అధికారులు పేర్కొన్నారు.

## యాదగిరిగుట్టలో వైభవంగా వసంత నవరాత్రులు ప్రారంభం



- గణపతి పూజతో ఉత్సవాలకు శ్రీకారం
- ఈ నెల 27న సీతారాముల కల్యాణం



**యాదగిరిగుట్ట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ పర్వత వర్ధిని సమేత రామచంద్రస్వామి ఆలయంలో సీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు సోమవారం వరకు మొత్తం 12 రోజులపాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 26 గురువారం రాత్రి 8 గంటల నుంచి సీతారామచంద్రస్వామి వారి ఎదుర్కోలు మహోత్సవం, 27 శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి కళ్యాణ మహోత్సవం, 28 శనివారం హరి పట్టాభిషేకం, రాత్రి 8 గంటల నుంచి డోలోత్సవం నిర్వహించనున్నారు. 29 ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సత్యనారాయణ స్వామి వ్రతం, 30 సోమవారం నిత్యపూజలు, కంకణ విమోచనం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్సవాలకు ముందు ఆలయ అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి, గర్భగుడి సహా ఆలయ పరిసరాలను గంగాజలంతో సంప్రోక్షణ చేసి శుద్ధి చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నరసింహమూర్తి, ప్రధాన అర్చకులు సత్యనారాయణ శర్మ సిద్ధాంతి, నాగరాజు శర్మ, ఎఈఓ రఘు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ మైదానంలో రాజపేట కుర్రోడి జోరు

- హైదరాబాద్ అండర్-19 జట్టులో యశ్వీర్ గౌడ్ మెరుపులు
- వచ్చే ఏడాది టీమ్ ఇండియాలో చోటుపై ఆశలు



**రాజపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** క్రికెట్ రంగంలో రాజపేట మండలానికి చెందిన యువ కిశోరం ఊట్కూరు యశ్వీర్ గౌడ్ సత్తా చాటుతున్నాడు. మండల కేంద్రానికి చెందిన ఊట్కూరు రాజు గౌడ్ కుమారుడైన యశ్వీర్, గత మూడేళ్లుగా హైదరాబాద్ క్రికెట్ జట్టు తరపున నిలకడైన ప్రతిభ కనబరుస్తూ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. అండర్-16 నుంచి అండర్-19 వరకు అన్ని విభాగాల్లోనూ రాణిస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇటీవల జరిగిన 'ఛాలెంజ్ ట్రోఫీ ఫర్ ఇండియా-18'లో హైదరాబాద్ జట్టు విజేతగా నిలవడంలో యశ్వీర్ కీలక పాత్ర పోషించాడు. తన అద్భుత ప్రదర్శనతో బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ప్రశంసలు అందుకున్నాడు. ప్రస్తుతం 18 ఏళ్ల వయసున్న ఈ యువ ఆటగాడు, ఇదే ఫామ్ కొనసాగిస్తే వచ్చే ఏడాది ఐపీఎల్ లేదా టీమ్ ఇండియా (అండర్-19)లో చోటు దక్కించుకోవడం ఖాయమని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. తన కుమారుడి ప్రతిభ పట్ల తండ్రి రాజు గౌడ్ హర్షం వ్యక్తం చేస్తున్నారు.





## రాజపేటలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

- పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, సర్పంచ్ మధు
- ఘనంగా శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠకు అంకురార్పణ

**రాజపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** చారిత్రక వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తిని చాటిచెప్పేలా రాజపేట మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గురువారం విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన భూమి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, స్థానిక సర్పంచ్ కోయ మధు ముఖ్య అతిథులుగా హాజరై శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతకు శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, నిర్వాహకులు ఎర్ర గోకుల రాజు, సట్టు నాని, ఆడెపు శ్రీశైలం, రేగు సిద్ధులు, కుమ్మరి లక్ష్మణ్, బిర్రు సురేష్, సాధన బోయిన శంకర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లయ్య కుటుంబానికి ఎర్రోళ్ల శ్రీనివాస్ పరామర్శ

- బొందుగులలో మృతుని చిత్రపటానికి నివాళి
- అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా

**రాజపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన కొమ్ము మల్లయ్య మరణం పట్ల రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం బొందుగుల గ్రామానికి చేరుకున్న ఆయన, మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని భార్య భారతమ్మ, సోదరుడు పోచయ్య, కుమారులు కుమార్, శ్రీకాంత్, సుమన్, సురేష్, హరీష్‌లను ఓదార్చారు. కుటుంబ పెద్దను కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య, ఉప సర్పంచ్ అబ్దుల్ ఆబిద్, గ్రామ శాఖ అధ్యక్షులు గోపగాని యాదగిరి గౌడ్, మర్ల నాగరాజు, గోళ్ళూరి ప్రభాకర్, కట్ట శంకర్ తదితరులు పాల్గొన్నారు.



తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..



# ప్రభుత్వ విప్‌కు ఉగాది శుభాకాంక్షల వెల్లువ

- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కలిసిన రాజపేట నేతలు



**రాజపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రేణిగుంట గ్రామ పార్టీ అధ్యక్షుడు బొద్దుల నగేష్, కోరే వెంకటయ్య తదితరులు ఉన్నారు.

# రేణికుంటలో రంజాన్ తోఫా పంపిణీ

- బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కానుకల అందజేత



**రాజపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రాజపేట మండలం రేణికుంట గ్రామంలో ముస్లిం సోదరులకు గురువారం రంజాన్ కానుకలను అందజేశారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు బొద్దుల నగేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పంపిణీలో పలువురు ముస్లిం కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేద ముస్లిం సోదరులు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ ఈ తోఫాను అందించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోరే వీరయ్య, వార్డు సభ్యులు పోసుగొండ మధు, గొర్రె మల్లయ్య, కురుమ సంఘం అధ్యక్షుడు పుప్పాల కుమారస్వామి, పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇసుక బుకింగ్‌కు ఆన్‌లైన్ 'చికాకు'

- హడావిడిగా అమలుపై లబ్ధిదారుల ఆగ్రహం
- స్తంభించిన భవన నిర్మాణాలు.. అక్రమ రవాణాకు ఆస్కారం?




**రాజపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండలంలో ఇసుక అనుమతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలు లబ్ధిదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బుధవారం నుంచి కేవలం ఆన్‌లైన్ ద్వారానే ఇసుక బుకింగ్ చేసుకోవాలన్న ఆదేశాలు వెలువడటంతో గృహ నిర్మాణాలు, ప్రభుత్వ పనులపై తీవ్ర ప్రభావం పడుతోంది. అక్రమ రవాణాను అడ్డుకోవడానికి తీసుకొచ్చిన 'మన ఇసుక వాహనం' విధానం క్షేత్రస్థాయిలో సమస్యలకు దారితీస్తోందని విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం మండలంలోని కేవలం ఐదు వాగుల్లోనే ఇసుక అందుబాటులో ఉండగా, కొత్త నిబంధనలతో బుకింగ్ ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. దీనివల్ల గ్రామాల్లో సీసీ రోడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం నిలిచిపోయే ప్రమాదం ఉందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. నిబంధనల సాకుతో ఇసుక దొరకకపోతే, అక్రమ రవాణా మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మైసమ్మ చెరువు అలుగు కబ్జా

శంషాబాద్ రూరల్, మార్చి 19: శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలో కొందరు అక్రమార్కులు పట్టా భూమికి అనుకొని ఉన్న చెరువు అలుగు (ప్రభుత్వ) భూమిని దర్జాగా కబ్జాచేసి అంతటితో ఆగకుండా.. అలుగు భూమిలో ఉన్న ఈత చెట్లను తొలగించి పట్టాభూమిలో కలుపుకొని చుట్టూ భారీ ప్రహరీ (ఫ్రికాస్ట్) నిర్మించారు. వివరాలు.. శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామ రెవెన్యూ పరిధిలోని హైదరాబాద్–బెంగుళూరు పాత జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 115 నుంచి 122 వరకు పట్టాభూమి 5ఎకరాల 3 గుంటల భూమి ఉంది. దానికి అనుకొని ఉన్న పాలమాకుల మైసమ్మ చెరువు అలుగుకు అనుకొని ఉన్న దాదాపు ఎకర ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి అక్కడ ఉన్న ఈత చెట్లను తొలగించి అలుగును పూర్తిగా పూడ్చివేసి కబ్జాకు పాల్పడిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గత డిసెంబర్ 30వ తేదీన గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌తో పాటు, శంషాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

# భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు.. ఘనంగా పచ్చడి వితరణ





- అంబేద్కర్ నగర్‌లో కాలనీవాసుల ఉత్సాహం
- పాల్గొన్న మార్కెట్ చైర్మన్ బిజన బాలమణి భాస్కర్

**ఆలేరు, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలేరు పట్టణంలోని 9వ వార్డు అంబేద్కర్ నగర్‌లో ఉగాది సంబరాలు మిన్నంటాయి. స్థానిక మాతమ్మ గుడి వద్ద కాలనీవాసుల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ బిజన బాలమణి భాస్కర్, స్థానిక కౌన్సిలర్ అంగడి ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలోని సుఖదుఃఖాలకు ప్రతీక అని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ బిజన బాలమణి భాస్కర్, 9వ వార్డు కౌన్సిలర్ అంగడి ఆంజనేయులు, శ్రీకాంత్, అనిల్, విజయకుమార్ పాల్గొన్నారు. అలాగే కాలనీవాసులు సుక్క రామస్వామి, గంధమల్ల యాదగిరి, సంగి జోగయ్య, కందుల రామచందర్, గంధమల్ల వెంకటయ్య, గంధమల్ల అశోక్, కందుల శ్రీకాంత్, సుక్క నర్సింగరావు, సుక్క కృష్ణ, సుక్క పరుశరాములు, కందుల నర్సింగరావు, సుక్క రాజు, సంగి నీలయ్య, గడపె పరుషరాములు, సిరిపురం సాలయ్య, సంగి వెంకటేశ్, ఎర్ర కర్ణాకర్, కొనపురం రమేష్, కందుల రమేష్, కందుల వేణు, గడిపె యాది ఎల్లయ్య, కోణంపురం యాదగిరి, గూడెపు శ్రీనివాసు, గంధమల్ల శివమ్మ, సుక్క లక్ష్మి, బాలమణి పాల్గొన్నారు.

# మొగిలిపాకలో రంజాన్ తోఫా పంపిణీ.. శివాజీ విగ్రహానికి భూమిపూజ





- మత సామరస్యానికి ప్రతీకగా వేడుకలు
- పాల్గొన్న మత్స్యగిరి గుట్ట మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి

**వలిగొండ, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వలిగొండ మండలంలోని మొగిలిపాక గ్రామంలో ముస్లింలకు రంజాన్ తోఫాలను మత్స్యగిరి గుట్ట మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ తోఫా అనేది కేవలం ముస్లింలకు ఇచ్చే కానుక మాత్రమే కాకుండా అన్ని మతాలను గౌరవించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. ప్రతి ఏటా ఈ తోఫాను అందిస్తున్నట్లు తెలిపారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ముగించుకొని పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ముస్లింలకు సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

**శివాజీ విగ్రహ స్థాపనకు భూమి పూజ**

అదేవిధంగా మొగిలిపాక గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ స్థాపన కోసం ముద్దసాని కిరణ్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జడిగే బుచ్చయ్య యాదవ్, ఉప సర్పంచ్ షేక్ సైదులు, టీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు భీమనబోయిన బిక్షపతి, పాలసంఘం చైర్మన్ మద్దిపాండు రెడ్డి, మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య, మాజీ ఎంపీటీసీ రమేష్, మాజీ పాల సంఘం చైర్మన్‌లు పబ్బు సత్తయ్య, జక్క ఇంద్రరెడ్డి, మర్ల నర్సింహ, వార్డు సభ్యులు పబ్బు వెంకటేష్, మచ్చ అండాలు, పబ్బు శిరీష బాలకృష్ణ, మచ్చ సునీత స్వామి, టీఆర్ఎస్ పార్టీ నాయకులు మచ్చ నవీన్, జడిగే సత్యరాములు, జడిగే గోపాల్, ముద్దసాని శేఖర్ రెడ్డి, ముద్దసాని వెంకట రెడ్డి, జడిగే మహేష్, జడిగే బుచ్చయ్య, మర్ల లక్ష్మయ్య, జక్క శ్రీనివాస్ రెడ్డి, ఉక్కుర్తి బిక్షపతి, చలిచీమల కృష్ణ, మైనార్టీ నాయకులు షేక్ మౌలానా, షేక్ ఫకీర్, షేక్ ఖాసీం, షేక్ అజిత్, షేక్ మూర్తీజా, షేక్ కరీం, షేక్ ఇమామ్ పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై కాషాయ ధ్వజం ఎగురవేయాలి

- విజయానికి ప్రతీకగా ఉగాది వేడుకలు
- సొంత నివాసంపై జెండా ఎగురవేసిన మజ్జిగ నరేష్



**ఆత్మకూర్(ఎం), (తొలివెలుగు న్యూస్):** భారతీయ సంస్కృతిలో భాగమైన ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతి హిందువు తన ఇంటిపై కాషాయ జెండాను ఎగురవేసి ధర్మ నిరతిని చాటాలని మజ్జిగ నరేష్ కోరారు. గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని ఆయన తన నివాసంపై కాషాయ ధ్వజాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాలివాహనుడు శకులను ఓడించి విజయం సాధించిన గుర్తుగా శాలివాహన శకం ప్రారంభమైందని, ఆ విజయానికి చిహ్నంగా జెండాలు ఎగురవేయడం మన ఆచారమని వివరించారు. కార్యక్రమంలో మజ్జిగ రాంబాబు, సామ శ్రీనివాస్ రెడ్డి, గవ్వల లక్ష్మణ్, లోడి మహేష్ గౌడ్, లోడి నిఖిల్ గౌడ్, పంజాల వివేకానంద, కోరే గణేష్, లోడి మణికంఠ గౌడ్, లోడి ప్రదీప్ గౌడ్, కొమ్మరాజుల ఉదయ్, మోటే సాయి, చేపూరి సాయి సోమేశ్వర్, గవ్వల మహేష్, కోరే దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

- బందూకు పట్టి దొరల గడపలు తొక్కించిన వీరనారి
- ఘనంగా నివాళులర్పించిన సిపిఎం నేత ఎం.డి. జహంగీర్




**యాదాద్రి భువనగిరి, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** నైజాం నియంతృత్వానికి వ్యతిరేకంగా, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం జీవితం నేటి తరానికి ఆదర్శమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. జహంగీర్ పేర్కొన్నారు. గురువారం భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో మల్లు స్వరాజ్యం 4వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొరల ఆగడాలకు వ్యతిరేకంగా మహిళా లోకాన్ని చైతన్యం చేస్తూ తుపాకీ పట్టిన గొప్ప వీరనారి ఆమె అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, దయ్యాల నరసింహ, గడ్డం వెంకటేష్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు మహేష్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్, సిపిఎం భువనగిరి మండల కార్యదర్శివర్గ సభ్యురాలు కొండమడుగు నాగమణి, చిన్నయ్య, ప్రభాకర్ రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు.. సర్పంచ్ నివాసంపై కాషాయ జెండా

- హిందూ బంధువులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన కోయ మధు

**రాజపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్) :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రాజపేట సర్పంచ్ కోయ మధు తన నివాసంపై గురువారం కాషాయ జెండాను ఎగురవేశారు. నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ధర్మ రక్షణకు, భక్తికి ప్రతీకగా కాషాయ జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. రాజపేట మండల మరియు పట్టణ ప్రజలందరికీ, హిందూ బంధువులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది ప్రజలందరికీ శుభం కలగాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.



# ప్రభుత్వ విప్‌గా వేముల వీరేశం.. గంగుల వెంకట్ రాజిరెడ్డి హర్షం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు



**రామన్నపేట/నకిరేకల్, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమించడం పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేసే వీరేశంకు దక్కిన ఈ పదవి పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. బడుగు, బలహీన వర్గాల గొంతుకగా నిలిచే వీరేశంపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, ఉమ్మడి జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నియామకంతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ విప్‌గా వేముల వీరేశం నియామకంపై హర్షం

- ముఖ్యమంత్రి, మంత్రులకు మేడి రవిచంద్ర కృతజ్ఞతలు



**రామన్నపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమించడం పట్ల టిపిసిసి అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తున్న వీరేశంకు దక్కిన ఈ గౌరవం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, ఉమ్మడి జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, నలమడ ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పట్ల అవగాహన ఉన్న నాయకుడికి సముచిత స్థానం కల్పించడం శుభపరిణామమని మేడి రవిచంద్ర పేర్కొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మహేందర్ రెడ్డి

- వెల్లంకి మాజీ ఎంపీటీసీకి దక్కిన కీలక బాధ్యత
- నియామకం పట్ల సర్వత్రా హర్షం



**రామన్నపేట, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా వెల్లంకి గ్రామ పంచాయతీ మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి నియామకమయ్యారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన అధిష్ఠానం ఈ బాధ్యతలను అప్పగించింది. రామన్నపేట మండల పరిధిలోని వెల్లంకి గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డికి జిల్లా స్థాయిలో కీలక పదవి దక్కడంపై మండల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా అర్థ వెంకట్ రెడ్డి నియామకం

- చౌటుప్పల్ నేతకు దక్కిన కీలక పదవి
- నియామకం పట్ల అల్లాపురం గ్రామస్తుల హర్షం




**చౌటుప్పల్, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామానికి చెందిన అర్థ వెంకట్ రెడ్డి నియమితులయ్యారు. పార్టీ పట్ల ఆయన చూపిస్తున్న నిబద్ధతను గుర్తించిన జిల్లా అధిష్ఠానం ఈ బాధ్యతలను అప్పగించింది. మండల కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న వెంకట్ రెడ్డికి జిల్లా స్థాయి పదవి దక్కడం పట్ల అల్లాపురం గ్రామ కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సమన్వయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. సహకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు.. ఈ ఏడాది సుభిక్షం

- సీతారామచంద్రస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం
- పాల్గొన్న పురపాలక చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని చౌటుప్పల్ పట్టణంలోని భవాని నగర్ శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణ కార్యక్రమానికి పురపాలక చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద పండితులు పెద్ది సుధాకర్ శర్మ, పెద్ది కిషోర్ శర్మలు నూతన సంవత్సర ఫలితాలను భక్తులకు వివరించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, రైతాంగం వృద్ధి సాధిస్తుందని పండితులు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి, భక్షాల వితరణ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, ఆలయ ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్, గుర్రం వెంకటేష్, వరకల వెన్నెల రవి గౌడ్, తూర్పాటి నరసింహతో పాటు పలువురు పురపాలక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తాజ్‌పూర్‌లో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

- సొంత నిధులతో కానుకలు అందజేసిన సర్పంచ్ సంతోష శ్రీనివాస్
- నిరాశ్రయురాలైన మహిళకు లక్ష రూపాయలతో ఇంటి నిర్మాణం






**యాదాద్రి భువనగిరి, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో పేద ముస్లిం మైనారిటీ కుటుంబాలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ తోఫాలను ఆయన సొంత నిధులతో అందజేయడం విశేషం. ఈ సందర్భంగా సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో పేద ముస్లిం కుటుంబాలు ఎక్కువగా ఉండటంతో వారు పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఉద్దేశంతో ఈ తోఫాలను అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఏ వర్గానికి చెందిన వారికైనా ఆపద వచ్చినప్పుడు అండగా నిలుస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా సొంత నిధులతో ఈ రంజాన్ తోఫాలను అందిస్తున్నామని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో తోఫాలు అందలేదని విమర్శించారు. అలాగే గ్రామంలోని ఓ ముస్లిం మహిళకు ఇల్లు లేకపోవడంతో సుమారు లక్ష రూపాయల వ్యయంతో గృహాన్ని నిర్మించి రంజాన్ రోజున గృహప్రవేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముస్లింలతో పాటు హిందువులు మరియు ఇతర వర్గాల ప్రజలకూ అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబ్ యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మరపు లక్ష్మీ బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజు, ఎస్కే హైమద్, మాజీ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ ముస్లిం నాయకులు, ముస్లిం మైనారిటీ సోదరులు, మహిళలు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# భూవివాదం వేధింపులు.. ప్రైవేటు ఉద్యోగి బలి

- ఆరేళ్లుగా వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య
- ఆరుగురిపై కేసు నమోదు చేయాలని భార్య ఫిర్యాదు
- కలచివేస్తున్న మృతుడి లేఖ.. 'నా దేహాన్ని కబ్జా భూమిలోనే పూడ్చండి'
- సొంతవాళ్లే కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని ఆవేదన
- ఫోన్ పాస్‌వర్డ్ సహా పూర్తి వివరాలు లేఖలో నిక్షిప్తం




**ఘటకేసర్/భూదాన్ పోచంపల్లి, మార్చి 19 (తొలివెలుగు న్యూస్):** భూవివాదాల నేపథ్యంలో దీర్ఘకాలంగా ఎదురైన మానసిక వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘటకేసర్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారండ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, ఘటకేసర్ మండలం, అన్నోజిగూడ గ్రామంలోని సూర్యనగర్ కాలనీలో నివసిస్తున్న బోదాసు శ్రీనివాస్ (38), షామీర్‌పేటలోని సాయి లైఫ్ సైన్సెస్ సంస్థలో ఉద్యోగం చేస్తూ కుటుంబంతో హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. వీరి స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా, పోచంపల్లి మండలం, దంతూరు గ్రామంలో ఉన్న వ్యవసాయ భూమి విషయంలో కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ భూవివాదంపై బోదాసు నర్సింహ, సిద్ధగోని మల్లయ్య, కంబాలపల్లి నర్సింహ, బోదాసు చిన్న ఈరయ్య, బోదాసు బాలరాజు, బోదాసు యాదయ్య తదితరులు కలిసి గత ఆరు సంవత్సరాలుగా కోర్టులు, పోలీస్ స్టేషన్లలో తప్పుడు కేసులు పెడుతూ తమను మానసికంగా వేధిస్తున్నారని మృతుడి భార్య బోదాసు సౌజన్య తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ వేధింపుల వల్ల శ్రీనివాస్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడని తెలిపింది. ఈ నేపథ్యంలో మార్చి 18 రాత్రి వరకు కుటుంబ సమస్యలపై భార్యతో చర్చించిన శ్రీనివాస్, మార్చి 19 ఉదయం సుమారు 4 గంటల సమయంలో ఇంట్లోని హాల్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య వెంటనే దిగదీసి చూసేసరికి అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనకు భూవివాదంలో ఉన్న వ్యక్తులే కారణమని ఆరోపిస్తూ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సౌజన్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**మృతుడి సూసైడ్ నోట్:**

**నా ఆత్మహత్యకు కారణం:**

నా వ్యవసాయ భూమిలో ఎలాంటి వాటా లేకున్నా, ఉన్నట్లుగా నా భూమిని కబ్జా పెడుతున్న భూకబ్జాదారులు, ఈ భూకబ్జాదారులకు సహకరిస్తూ తప్పుడు సాక్ష్యాలు చెబుతున్న మా బ్రదర్ బాలరాజు, ఈయన భార్య, మా నాన్న (నా మీద పాత పగతో) ఇతరులు డబ్బులకు తలొగ్గి భూమి లేకున్నా ఉన్నట్లుగా అబద్ధపు సాక్ష్యాలు చెబుతున్నారు. (వీరి పేర్లు ఎఫ్ఐఆర్ కాపీలు, పిటిషన్‌లలో ఉన్నవి). పోలీసు వారు తమ విచారణలో సరిగా విచారణ చేయకుండా, తప్పుడు సాక్ష్యుల వాంగ్మూలాన్ని నిజ నిర్ధారణ చేయకుండా నా భూమికి వెళ్లకుండా తప్పుడు ట్రెస్‌పాస్ కేసు పెట్టి బెదిరిస్తున్నారు. మై డియర్ సన్స్, ఫోర్గివ్ మీ ప్లీజ్. నేను మెంటల్ హరాస్‌మెంట్ తట్టుకోలేక పోతున్నాను. సౌజన్య, సమాజంలో మన పిల్లలకు ఎలాంటి చెడ్డ పేరు రాకుండా వారిని గొప్పగా తీర్చిదిద్దుతావని కోరుకుంటున్నాను. నా కోరికను నిజం చేసి నాకు ఆత్మశాంతి కల్పించు. అమ్మా నన్ను క్షమించు. ఈ భూకబ్జాదారుల కోసం ఎన్ని దెబ్బలు తిన్నావు, విలువలేని మాటలు పడ్డావు, నన్ను క్షమించు అమ్మా. అక్క, చెల్లెల్లు, బావలు, నా అల్లుళ్లు, కోడళ్ళు మీరు నా భార్య పిల్లలతో ఎప్పటికీ ఇలాగే కలిసి ఉండాలని కోరుకుంటున్నాను. కనీసం నా అంతిమ యాత్రలోనైనా ఈ సమాజంలో మార్పు వస్తుందని ఆశిస్తూ నా దేహాన్ని నా భూమి కబ్జా చేస్తున్న భాగంలో పూడ్చాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే ఇంకెవరూ నా భూమిని కబ్జా చేయకుండా ఉంటారు. అది ఇన్నేళ్ల నా పోరాటానికి సంతృప్తిని ఇస్తుంది. నా వ్యవసాయ భూమి ఇతర వాటాని చట్టబద్ధంగా చేయించి నా భార్య పిల్లలకు చెందేలా చూడమని నా అక్క చెల్లెళ్లు బావలను కోరుకుంటున్నాను. ఇప్పటికే కంబాలపల్లి నర్సింహ కుటుంబం 4 గుంటల భూమిని కబ్జా పెట్టి దొంగ డాక్యుమెంట్స్ సృష్టించి మా భూమి నక్షాలో ఎలాంటి బాటలు (రోడ్డు) లేకున్నా ఉన్నాయని సిద్ధగోని మల్లయ్య కుటుంబం, కంబాలపల్లి నర్సింహ కుటుంబం, బోదాసు నర్సింహ కుటుంబం కబ్జా పెడుతున్నాయి. నరేంద్ర ప్రసాద్ సార్, వేణు సార్ ఈ నేరస్తులకు కఠినమైన శిక్షలు పడేలా చేసి న్యాయాన్ని గెలిపించాలని కోరుకుంటున్నాను.

**సత్యమేవ జయతే ధర్మో రక్షతి రక్షితః**

అంటూ రాసిన సూసైడ్ నోట్ కలచివేస్తుంది. శ్రీనివాస్ మృతితో అన్నోజిగూడ, దంతూరు గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.




## 'ఈగో రాజా' ఉగాది స్పెషల్ లుక్

శంబాల సక్సెస్‌తో ఫుల్ జోష్ మీదున్నాడు టాలీవుడ్ యంగ్ యాక్టర్ ఆది సాయికుమార్. బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టిన ఆదిసాయికుమార్ గురు శరవణన్ డైరెక్షన్‌లో ఓ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈగో రాజా (జుస్త్రశీ =ఖుయిఖు)టైటిల్‌తో వస్తోన్న ఈ మూవీని ఎస్‌జీఎస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై జీ సురేశ్ నిర్మిస్తున్నారు. ఆది సాయికుమార్ తమిళ్ డెబ్యూ సినిమాగా వస్తోన్న ఈగో రాజా తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సతీశ్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ కొత్త లుక్ విడుదల చేశారు. ఆదిసాయికుమార్ చుట్టూ రౌడీలు, ఒంటిపై గాయాలు, రక్తపు మరకలు చూస్తుంటే హై ఓల్టేజీ యాక్షన్ సీక్వెన్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. ఆది నిప్పు రాజేసేలా యాక్షన్ అవతార్‌లో ఇప్పటివరకు లేని విధంగా సిగరెట్ కాలుస్తూ అగ్రెసివ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. ఆదిలో ఇదివరకెన్నడూ చూడని డైమెన్షన్‌ను చూడబోతున్నారని తాజా లుక్‌తో హింట్ ఇచ్చేస్తున్నారు మేకర్స్. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ కేఎస్ రవికుమార్ దగ్గర పనిచేసిన గురు శరవణన్ డైరెక్షన్‌లో వస్తున్న సినిమా కావడం, బైలింగ్యువల్ ప్రాజెక్టు అవడంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఈ చిత్రాన్ని గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు. హై ఆక్టేన్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి రాబోయే రోజుల్లో మరిన్ని అప్‌డేట్ అందిస్తామని మేకర్స్ చెబుతున్నారు.

## కంటెంట్ చూసి ఆశ్చర్యపోతున్నారు



'మొదటి షో నుంచే అన్ని ప్రాంతాల నుంచి పాజిటివ్ టాక్ రావడం ఆనందంగా ఉంది. ఈ సినిమాలో ఇంత కంటెంట్ ఉంటుందని తాము ఊహించలేదంటూ చూసినవారిలో చాలామంది ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ని తీస్తున్నాననీ, వింటేజ్ పవర్‌స్టార్‌ని చూపించబోతున్నానని ముందునుంచీ చెబుతూ వచ్చాను. చెప్పింది చేసి చూపించాననే ఆత్మసంతృప్తితో ప్రస్తుతం నా హృదయం నిండిపోయింది. ఇప్పటివరకూ చూపించని కొన్ని అంశాలను ఈ మాస్ ఎంటైర్టైనర్‌లో చూపించాం. ఇందులోని ప్రతి పాత్రా ఆడియన్‌కి కనెక్టయింది. సాంకేతికంగా అందరూ ప్రాణం పెట్టారు. 'తొలిప్రేమ' పాట సెకండాఫ్‌లో పెట్టడం ఆడియన్స్‌ని బాగా నచ్చింది. ఇది మా టీమ్ సమిష్టి విజయం' అంటూ ఆనందం వ్యక్తం చేశారు దర్శకుడు హరీశ్‌శంకర్. ఆయన దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మించిన ఈ చిత్రం గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ ప్రెస్‌మీట్‌లో హరీశ్‌శంకర్ మాట్లాడారు. ఆట ఆటకీ వసూళ్లు పెరుగుతున్నాయని, ఇది పవర్‌స్టార్ వన్ మ్యాన్ షో అనీ, కచ్చితంగా భారీ వసూళ్లు ఖాయమని నిర్మాతలు నమ్మకం వెలిబుచ్చారు.

## అదేం తప్పు కాదు

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా దక్షిణాదిలో ఓ వెలుగు వెలిగి ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా బిజీ అయ్యిన నటి ప్రియమణి. డస్కీ బ్యూటీగా కుర్రాళ్లకు సెగలు రేపిన ప్రియమణి.. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో వరుసగా అవకాశాలు అందుకుంటుంది. ఇటీవల 'ఎస్ సరస్వతి' మూవీతో ప్రేక్షకులను పలకరించింది ఈభామ.. కాగా ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఇంట్రెస్టింగ్‌కామెంట్స్‌చేసింది ప్రియమణి. 'బికినీ ధరించడం తప్పు కాదు. స్టోరీకి తగినట్లుగా, ఆ పరిస్థితులకు అనుగుణమైన దుస్తులు వేసుకోవాల్సిందే. స్విమ్మింగ్ పూల్ సీన్ ఉంటే అప్పుడు చీర, జీన్స్ వంటివి ధరించలేం కదా. ద్రోణి సినిమాలో బికినీ సీన్ చేయడానికి కాస్త భయపడ్డాను. అయితే ఆ చిత్ర దర్శకుడు నన్ను కన్విన్స్ చేసే ప్రయత్నం చేశాడు. అప్పట్లో 'టషన్' సినిమాలో కరీనా కపూర్ బికినీ ధరించిన సీన్ వైరల్ కావడంతో తనను కూడా అలాగే డిఫరెంట్‌గా చూపిస్తానని చెప్పాడు. అప్పటి వరకు నేను ఏ సినిమాలోనూ బికినీ, స్విమ్ సూట్ లాంటివి వేసుకోలేదు. దాంతో ఒకసారి ట్రై చేద్దామని ఓకే చెప్పా. ఈ సీన్ తర్వాత నాపై చాలా కామెంట్స్ వచ్చాయి. విపరీతంగా ట్రోలింగ్స్ చేశారు.. అప్పటి వరకు సాధారణ పాత్రలు చేసిన నన్ను.. ప్రేక్షకులు కొత్తగా చూడటంతోనే ఇలా జరిగింది. నటిగా ఉన్నప్పుడు పరిస్థితి డిమాండ్ చేస్తే అలాంటి డ్రెస్ వేసుకోక తప్పదు. అలాగని మన కంఫర్ట్‌ని పక్కన పెట్టకూడదు. ఇప్పుడు బికినీ వేసుకోమంటే మాత్రం చేయను' అంటూ తేల్చి చెప్పేసింది. ఇక ప్రస్తుతం ప్రియమణి నటించిన జన నాయగన్ రిలీజ్‌కు రెడీగా ఉంది. ఇది కాకుండా జీడీఎన్, గోల్‌మాల్ సినిమాల్లో ప్రియమణి నటిస్తోంది.



## అది బ్రేకింగ్ న్యూస్ కాదు!

అగ్ర కథానాయిక అనుష్క శెట్టి ఓ వ్యాపారవేత్తతో పెళ్లిపీటలెక్కబోతున్నదని గత కొన్ని రోజులుగా సోషల్‌మీడియాలో వార్తలొస్తున్నాయి. తాజాగా వీటిని ఆమె వ్యక్తిగత టీమ్ ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఒకరి వ్యక్తిగత జీవితం గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించింది. 'అనుష్క శెట్టి వయసుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వార్తల్ని ప్రచారం చేస్తున్నారు. మరి హీరోల వయసు విషయంలో మీలో ఆ ఉత్సాహం ఎందుకు కనిపించడం లేదు?' అని ప్రశ్నించింది. 'తన వ్యక్తిగత జీవితం విషయంలో అనుష్క గోప్యతను పాటిస్తుంది. పెళ్లి అనేది వ్యక్తిగత విషయం. అది బ్రేకింగ్ న్యూస్ ఎంత మాత్రం కాదు. వార్తల్ని ప్రచురించే ముందు నిజానిజాలేమిటో తెలుసుకోం డి' అంటూ అనుష్క టీమ్ పేర్కొన్నది.

